## క్లుప్తంగా

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం



పాఠాలు బోధిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

**హుకుంపేట:** మండలంలోని పెదగరువు ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, పాతకోట ప్రాథమిక పాఠశాలలను సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతు విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాతకోట సర్పంచ్ పాటి చిన్నయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

### మండల సమావేశం రేపు

**అరకులోయ రూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని కోరారు.

### 30న సచివాలయాలు ప్రారంభం

**అడ్డతీగల:** మండలంలోని వేటమామిడి, తుంగమడుగుల, డి.రామవరంలో గ్రామ సచివాలయాలను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఈనెల 30న ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం దుశ్చర్తి సచివాలయం పరిధిలోని దాకోడు గ్రామ పంచాయతీ కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు.

### తాగునీటి సమస్యపై వినతి



ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

**డుంబ్రిగుడ:** మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బోరు పాడవడంతో వారం రోజుల నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతు చేయాలని వినతిలో కోరారు. నాయకుడు సత్యనారాయణ, సింహాచలం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### పైపులైన్ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అమల, సర్పంచ్ కన్నారావు

**చింతూరు:** మండలంలోని ఎర్రంపేటలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న తాగునీటి పైపులైన్ పనులను ఎంపీపీ సవలం అమల, సర్పంచ్ కారం కన్నారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడంలో భాగంగా పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బుచ్చిబాబు, గ్రామస్తులు రాజు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

### మొల్లేరులో రేపు 'గడప గడపకు'

**గంగవరం:** మండలంలోని మొల్లేరులో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు బుధవారం పర్యటించనున్నట్టు మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వారు నెల్లిపూడి చేరుకుంటారని అక్కడ నుంచి మొల్లేరు వరకు పర్యటిస్తారని, మధ్యాహ్నం ఒంటి గంటకు కాటమస్వామి ఆలయం వద్ద సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం రెండు గంటల నుంచి మొల్లేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అన్నదాతకు అండదండ

- రైతుకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు
- రైతన్నల హర్షం



రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

**చింతూరు:** దేశానికి వెన్నెముక లాంటి రైతన్నకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. అన్నదాతకు అండగా ఉంటూ సాగు విప్లవానికి నాంది పలికింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతన్నలు నానా ఇబ్బందులు పడ్డారు. పెట్టుబడి రుణాల కోసం రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల కోసం రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఆరుగాల శ్రమించి పంటలు పండించినా సరైన గిట్టుబాటు ధరలేక, సకాలంలో కొనే నాథుడు లేక నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతన్నలు నేడు సుస్థిర వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయాన్ని పండగలా మార్చి రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తోంది.

**ఆర్‌బీకేల ద్వారా అన్ని సేవలు**

రైతులు ఇబ్బందులు పడకుండా ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని గ్రామ వ్యవసాయ సహాయకులుగా నియమించింది. స్థానికంగా రైతులకు ఏ సమస్య వచ్చినా సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు పంట పెట్టుబడి నిమిత్తం రైతు భరోసా కింద ఏటా రూ 13,500 నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. రైతులు పంటలు వేసే సమయంలో మట్టి నాణ్యతను పరిశీలించి దానికి తదనుగుణంగా ఎలాంటి విత్తనాలు వేయాలి, సస్యరక్షణ చర్యలపై సలహాలు ఇస్తున్నారు. వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పొలంబడి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ప్రాంత గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించడంతో పాటు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. రైతులు దళారుల బారిన పడకుండా వారు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తోంది. సాగుకు ఉపయోగపడేలా యంత్ర పరికరాలు, ట్రాక్టర్లను రాయితీపై పంపిణీ చేస్తోంది.

**రంపచోడవరం, చింతూరు డివిజన్లలో**

రంప చోడవరం, చింతూరు డివిజన్లలో 66 రైతు భరోసా కేంద్రాలున్నాయి. రెండు డివిజన్ల పరిధిలోని రైతులు అధికంగా ఎంటీయూ-1064, ఆర్‌జీఎల్-2537, ఎంటీయూ-1121, ఎంటీయూ-7029, ఎంటీయూ-1061, బీపీటీ-5204 వరి రకాలను పండిస్తున్నారు. ఈ ఏడాది రాయితీపై పంపిణీ చేసేందుకు 5,851 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకు 2,677 క్వింటాళ్లు రైతుభరోసా కేంద్రాలకు సరఫరా అయినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

**ఆనందంగా ఉంది**



ప్రభుత్వం రైతు భరోసాగా అందిస్తున్న సాయం పంట పెట్టుబడికి ఉపయోగపడుతోంది. రాయితీపై విత్తనాలు అందిస్తుండడంతో మాకు ఎంతో మేలు జరుగుతోంది. పండిన పంటకు కూడా ప్రభుత్వం గిట్టుబాటు కల్పించి, మద్దతు ధర అందిస్తుండడం చాలా ఆనందంగా ఉంది. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– సవలం భీమయ్య, రైతు, చూటూరు, చింతూరు మండలం

**ఆర్‌బీకేలతో మేలు**



గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. విత్తనాలు, ఎరువులతో పాటు వ్యవసాయ పరికరాలు కూడా రైతులకు అందచేస్తున్నాం. పంటల సాగు, సస్యరక్షణ చర్యలు తదితర విషయాలపై రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

–కాశీవిశ్వనాథ చౌదరి, ఏడీఏ, రంపచోడవరం

## ఇంటింటా సంక్షేమ వెలుగులు



లోదొడ్డిలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

**రాజవొమ్మంగి:** పేదల ఇంటింటా సంక్షేమ వెలుగులు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని లోదొడ్డి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా వారు గ్రామంలో 140 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అన్ని వర్గాలకు పారదర్శకంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సంక్షేమ పథకాలను పొందవచ్చన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు వర్తించకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటింటికీ బృందాలుగా తిరుగుతున్న అధికారులు సమస్యలను తక్షణమే పరిష్కరించి న్యాయం చేస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, వైస్ ఎంపీపీలు జుర్రా రాజేశ్వరి, చప్పా చంద్రరాణి, ఎంపీటీసీ సభ్యురాలు గంగదుర్గ, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివ, ఆగూరి శుభలక్ష్మి, కించు లక్ష్మి, నాయకులు జాన్‌బాబు, అర్జున్, శాంతకుమారి, సత్యనారాయణ, ముసలయ్య, అప్పారావు, చంద్రుడు, తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంఈవో తాతబ్బాయిదొర, ఏపీఎం ఆదినారాయణ, ఏపీవో సురేష్‌కుమార్, ఎలక్ట్రిసిటి ఏఈ సురేష్ కుమార్, సీఐ బాజిలాల్, ఎస్‌ఐలు షరీఫ్, గోపీనరేంద్రప్రసాద్, స్పెషల్‌బ్రాంచ్ హెచ్‌సీ దుర్గారావు, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో సమస్యల సత్వర పరిష్కారం



డుంబ్రిగుడులో అవగాహన కల్పిస్తున్న నాయకులు



చింతపల్లిలో సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి



కొయ్యూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలరావు

**డుంబ్రిగూడ:** జగనన్న సురక్ష తోనే ప్రజా సమస్యల సత్వర పరిష్కారం సాధ్యమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాక సింహాచలం తెలిపారు. మండలంలో కురిడి పంచాయతీలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు సోమవారం గోరపూర్, పితమరిగూడ గ్రామల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. సర్పంచ్ నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ త్రినాథ్, నాయకులు మహదేవ్, కామేశ్వరరావు, పురుషోత్తం, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లిరూరల్:** మండలంలోని కొమ్మంగి పంచాయతీలో రొరింతాడ గ్రామంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష సర్వేను ఎంపీడీవో ఆశాజ్యోతి పర్యవేక్షించారు. వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలను గుర్తించి, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. లబ్ధిదారులు తమకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా పొందవచ్చన్నారు. అనంతరం కొమ్మంగిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. గిరిజనులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యూరు:** దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా ఆయా రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తహసీల్దార్ తిరుమలరావు అన్నారు.రావణాపల్లిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేలో పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి తిరిగి సమస్యలు తెలుసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన కొన్ని ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన సచివాలయాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. ఏఎంసీ సభ్యులు అచ్యుత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి దృష్టికి మండల సమస్యలు



మంత్రి విడదల రజినికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

**అనంతగిరి:** జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం పర్యటించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిను అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంతగిరి మండలంలోని పలు సమస్యలను విన్నవించారు. ఇందులో భాగంగా అనంతగిరిలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, స్థానికంగా పోస్టుమార్టం పరీక్షలు జరిగేలా చూడాలని, మండలానికి రెండో 108 వాహనం మంజూరు చేయాలని వినతిలో కోరామన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీపీ నీలవేణి చెప్పారు.

## క్షయపై అవగాహన అవసరం



రంపచోడవరంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు వంశీ

**రంపచోడవరం:** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీటీసీ వంశీ కుంజం అన్నారు. తామరపల్లి పంచాయతీలో సోమవారం ప్రకృతి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో క్షయవ్యాధి లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకుని, వ్యాధినిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా కోలుకోవచ్చన్నారు. ప్రభుత్వం క్షయ వ్యాధికి మంచి మందులు సరఫరా చేస్తుందన్నారు. ఏజెన్సీలో చాపకింద నీరు వ్యాపిస్తున్న క్షయవ్యాధిపై అందరూ అప్రమత్తంగా వ్యవహించాలన్నారు. గ్రామస్థాయిలో అందరికి అవగాహన కల్పించడం ద్వారా క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు.వీఆర్‌ఓ డి.వి.వి.సత్యనారాయణ, ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## మెరుగైన బోధన అందించాలి



విద్యార్థులకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ బాబు

**మారేడుమిల్లి:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు అన్నారు. ఆయన ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబుతో కలిసి మండలంలోని రామన్నవలస, దేవరపల్లి పాఠశాలలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పుస్తకాలు, బ్యాగ్స్, యూనిఫామ్ అందరికీ అందాయ లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యా బోధనలపై ఆరా తీశారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మెరుగైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో మండలంలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు రూ.1000, సర్పంచ్ కొండ జాకబ్, వైస్ ప్రెసిడెంట్ వీరబాబు రూ.500 నగదును అందజేశారు.

## సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

**వీఆర్ పురం:** సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాబు, సర్పంచ్‌లు పిట్టా రామారావు, మూట్లు బాలరాజు, నేతలు ముత్యాల శ్రీనివాస్, మాచర్ల గంగులు చెప్పారు. రేఖపల్లిలోని సీనియర్ నాయకుడు మాదిరెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం పార్టీ శ్రేణుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. వచ్చే నెలలోని మొదటివారంలో కూనవరం మండలంలోని జరగనున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సత్తిబాబు, కాంతారావు, బాలరాజు, వెంగళరావు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

**కొయ్యూరు:** నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో లాలం సీతయ్య సూచించారు. మండల కేంద్రంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు తదితరులతో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేలా హెచ్‌ఎంలు నిత్యం పర్యవేక్షిస్తుండాలన్నారు. ఎంఈవో పి.ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం అన్ని పాఠశాలలలోను పేరెంట్స్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా కిట్లను పూర్తిగా అందజేయాలన్నారు. బూట్లు సైజుల్లో తేడా లుంటే వారి కొలతలు తీసుకుని పంపించాలన్నారు. పిల్లలు ఎవరు బడి బయట ఉండకూడదన్నారు. మండలంలోని 22 పాఠశాలలకు రూ.6లక్షల చొప్పున నిధులు వచ్చాయని, వాటితో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రతీ ఉపాధ్యాయుడు టీచర్ లెర్నింగ్ ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రసాద్, ఎంపీడీవో సీతయ్యను ఘనంగా సన్మానించారు. జేఈ రామకృష్ణ, ఏపీఎం శ్రీనివాస్, ఈవోఆర్‌డీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వ్యసనాలకు దూరంగా ఉండాలి



అరకులోయలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ప్రభాకర్



చింతూరు డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు



వై.రామవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

**అరకులోయ రూరల్:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్బంగా న్యాయవాది ప్రభాకర్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనమవుతోందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హితవు పలికారు. యువత రానున్న తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. న్యాయవాది సింహాచలం, కోర్టు సిబ్బంది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం**

**చింతూరు:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మాలన దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు హారతి, వెంకట్రావు, పద్మ, అప్పనమ్మ, శకుంతల, శ్రీదేవి పాల్గొన్నారు.

**వై.రామవరం:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఆర్‌పీఎఫ్ డీ-42 బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలు, నష్టాలపై వీధుల్లో ప్రచారం చేశారు. అనంతరం స్థానిక బస్టాండు ఆవరణలోమానవహారం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు

**గూడెంకొత్తవీధి:** మండలంలోని రింతాడ సచివాలయం పరిధిలో కడుగులలో వైద్యుడు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి జ్వరం వచ్చినా సమీప ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మరుగబెట్టిన నీటిని తాగాలని, నిల్వ ఆహారాన్ని తీసుకొద్దన్నారు. జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 16 వరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో రోజు పది గృహాలు సందర్శించి వ్యాధిపై సర్వే చేయాలని సూచించారు. స్పర్శ లేని మచ్చలు, రాగిరంగులో ఉండే మచ్చలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, చిన్నారులకు పరీక్షలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ మధులత, ఏఎన్‌ఎం భాగ్యలత, సచివాలయ ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం



వై.రామవరంలో విద్యార్థులకు జేవీకే కిట్‌లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



పెదబయలులో మాట్లాడుతున్న హెచ్‌ఎం పూర్ణచంద్రరావు

**వై.రామవరం:** స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం పల్లాల లక్ష్మణరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో 200 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మీ అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఏ ప్రభుత్వం అందించలేని పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, అందజేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు త్రిమూర్తులు, కనకరాజు, నారాయణరావు, విద్యా కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం**

**పెదబయలు:** ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, అవకాశాలు అందిపుచ్చుకోవాలని అరడకోట గిరిజన సంక్షేమ బాలూర పాఠశాల హెచ్‌ఎం చెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చదివించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అమ్మఒడి, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, ఆణిముత్యాలు, జగనన్న గోరుముద్ద తదితర కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని, చదువుతోనే మార్పు వస్తుందన్నారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో బడి ఈడు పిల్లలు ఉంటే బడికి నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.